503078601

# ప్రబోధ 12

చిత్రంబులు త్రైలోక్య పవిత్రంబులు
భవలతాల విత్రంబులు సన్మిత్రంబులు
ముని జనవన చైత్రంబులు
విష్ణుదేవు చారిత్రంబుల్.

దివ్యాత్మస్వరూపులైన అధ్యాపకులారా, ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

చాలా విచిత్రమైన చిత్తరువు భగవంతుడు రచించిన యీ ప్రపంచము. దీనిని చూచి ఆశ్చర్య ఆనందములతో అనుభవించవలసినదే గాని విజ్ఞాన దృష్టితో విమర్శించుటకుగానీ, విశదీకరించుటకుగానీ వీలుకాదు. దేహములేని చిత్రకారుడు, రంగులు లేని కుంచె ఆధారము లేని గోడపైన అతి చిత్రముగా చిత్రించిన బొమ్మనే యీ జగత్తు. ఈ చిత్తరువును చూచుకాలది మాయామయంగా వుంటుంది. అగమ్యగోచరంగా వుంటుంది. ఉన్నదానిని లేనట్టుగా లేనిది వున్నట్టుగా నిరూపిస్తుంది. ఏది నిజమో ఏది అబద్ధమో గుర్తించుటకు వీలుకానిది యీ జగత్తు. సత్యమని కొందరు, అసత్యమని కొందరు, సదసత్తులతో కూడినమిథ్యమని యింకా కొందరు యింకా కొన్ని తర్క వితర్కములతో విమర్శించుతూ వచ్చారు. ఈ తర్కాలకు తార్కాణాలకు స్వస్తి చెప్పి మూలాధారమైన తత్వము గుర్తించుటమే సరియైన విద్య.

ప్రపంచ మంతయూ నేననే తలంపుపైనే ఆధారపడి వుంటున్నది. ఈ నేను అనే తత్త్వము మనస్సునందు వుండినంతవరకు యీ ప్రపంచము మనకు గోచరిస్తుంది. ప్రపంచము వుండినంత వరకును దుఃఖమును దూరము చేయుటకు వీలుకాదు. నిద్రయందు నేను అను తలంపు లేదు. ఎప్పుడు నేను అనే తలంపు లేదో అప్పుడు ప్రపంచము కూడను మనకు గోచరించదు. ప్రపంచము లేని స్థితిలో దుఃఖమనేది అదృశ్యము. కనుక యీ దుఃఖము యొక్క నివృత్తి నిమిత్తమై మానవుడు ఆనందమును కోరుచున్నాడు. ఆనందమంటే ఏమిటి? ఐశ్వర్యము, అధికారము, ఆరోగ్యము యివేనా మన ఆనందము యొక్క చిహ్నములు. ఈ జగత్తులో ఐశ్వర్యవంతులు యెంతమంది లేరు. వీరందరు ఆనందమును అనుభవించు చున్నారా? అధికార ఆరోగ్యములతో కూడిన వ్యక్తులు యెంతమంది లేరు. వీరందరు ఆనందమును అనుభవించు చున్నారా? లేదు. కారణము? నేను అనే తలంపు మానవుని యందు వుండినంత వరకు ఆనందము మనకు అతి దూరము.

ఎండ మావులను చూచి మృగములు దాహము నిమిత్తమై వాటి వెంట పరుగులెత్తి కడకు అది నీరుకాక దాహము తీరక నిలువునా నిరాశతో కూలి పోవుచున్నవి.

503078602

అదేవిధముగనే మానవుడు విషయములందు, వస్తువులయందు, ఆనందమును అనుభవింతునని ఆశించి కడకు అది నిత్యానందము కాక నిరాశతో కర్తవ్యాన్ని గుర్తించక కాయాన్ని వదులుతున్నాడు నేను అనే తలంపు యేనాడు మానవునినుండి విడిపోవునో ఆనాడే తాను బ్రహ్మస్వరూపము కాగలడు. వేదాంతము బ్రహ్మసత్యం జగత్ మిథ్య అని బోధించినది. ప్రపంచము సత్యమో, అసత్యమో అది మాయ లేక మిథ్యమో. ఈ ప్రపంచము యొక్క విషయమును ప్రపంచమునకు వదలిపెట్టు. దీని యొక్క నిత్యానిత్యములు ప్రపంచమే నిరూపించగలదు. మొదట నీవు సత్యమో అసత్యమో గుర్తించటానికి ప్రయత్నించు. నీవు నీ సత్యమును గుర్తించినప్పుడే జగత్తు మిథ్యమని నీవు సత్యమని నిర్ణయము చేసుకోగలవు. నేను బ్రహ్మ అనే పదము కలదు. అయితే యీపదమునకు ముందు నేను అనే పదము వుంటుండాది. ఈ నేను అనేపదము ఎక్కడిది? ఈ నేను అనేపదమునకు అర్థమేమిటి? నేను అనటము కేవలము యిది ఒక భావము కాక సహజము అయిపోతుంది. ఈ యొక్క సహజానికి ప్రక్కన కేవలము భావము అనే మనిషి యేర్పడుతుంది. అనగా నేను మనిషిని అనే పదము. నేను సహజము మనిషిని భావము. నేను పరిపూర్ణత్వము. మనిషి అనేది అపరిపూర్ణము. మనిషి అనేది ఒక హద్దుతో కూడినది. నేను అనేది అనంతమైనది. కనుక యీ హద్దుతో కూడిన మనిషి పరిపూర్ణమైన నేను తో కూడినప్పుడు నేనే అవుతుంది కాని తిరిగి మనిషి అనేపదము వుండదు. నది ఒక రూపనామము తో ప్రవహిస్తుంది. ఇది సముద్రముతో లీనము కాక పూర్వము యిది ఒక హద్దుతో వుంటుంటాది. దీనికొక పరిమితి వుంటున్నది. కాని అనంతమైన సముద్రముతో కలసినప్పుడు దీని యొక్క పరిమితి, దీని యొక్క రూపము, దీనియొక్క నామము, దీనియొక్క రుచి కోల్పోతుంది. కనుక నది సముద్రముతో చేరినప్పుడు సముద్రమే అవుతుంది గాని నది అనేది మరొకటిగా వుండదు. అదేవిధముగనే పరిమితము తో కూడిన మానవత్వము అపరిమితమైన నేను అనే తత్వముతో కూడినప్పుడు నేనే నిల్చిపోతుంది గాని యీ మనిషి అనే పరిమిత తత్వము వుండదు.

నేను అనేపదమునకు పుట్టుక స్థానమెక్కడ? దీనినే సంస్కృతమునందు అహం అన్నారు. అహం అనే పదము ఆత్మనుండి పుట్టినది. ఈనేను అనే సంకల్పమే యీయొక్క అహం. ఈనేను అనే సంకల్పము నుండియే మనస్సు అనేది ఒకరూపము చెందివున్నది. ఏతావాతా యీ మనస్సు, యీనేనే అహము ఆత్మయొక్క అంశమే. ఆత్మ తాత అనియు, అహం పుత్రుడనియు, యీ మనస్సనేది మనుమడనియు దీని యొక్క సంబంధము. ఇది ఒక వస్త్రము. ఈ వస్త్రమునకు దారములు ఆధారము. ఈ దారమునకు ప్రత్తి ఆధారము. ప్రత్తికి ఏరూపము లేదు నిర్మలత్వము, పవిత్రము మాత్రమే వుంటుంది. కనుక యీప్రత్తినుండియు యీదారము పుట్టించినది. ఈ దారము యొక్క చేరిక చేతనే వస్త్రము యేర్పడింది. అదేవిధముగా నిర్మల, నిశ్చల, నిస్వార్థమైన ఆత్మ తత్వము నుండియు అహం అనే నేను అనే తత్వము ఆవిర్భవించింది. ఈ అహం

503078603

అనే సంకల్పము నుండియే మనస్సు ఏర్పడింది. కనుక మన మనస్సు, మనయొక్క నేను అనే అహం తత్త్వము కేవలము ఆత్మ భావములతోనే, ఆత్మగుణములతోనే కూడివుంటుండాలి, చేరివుంటుండాలి. అహమునకు, ఆత్మకు వుండిన భేధాన్ని మనము గుర్తించాలి. అహం పుట్టేది, పెరిగేది వచ్చేది పోయేది. కాని ఆత్మకు పుట్టుట, పెరుగుట, నశించుట, వచ్చుట, పోవుట అనే పరిణామములు వుండవు. కనుకనే అపరిమితమైన ఆత్మ తత్త్వము నుండి పరిమితమైన నేను అనే అహం తత్త్వము తద్వారా యీ మనస్సనే స్వరూపము సంకల్పముల యొక్క యేకత్వము యేర్పడుతూ వచ్చింది. కనుకనే అన్నింటికి మూలాధారమైన తత్త్వమును మనము గుర్తించినప్పుడే సమస్తమును మనము గుర్తించిన వారమవుతాము. కనుక ప్రతీ మానవుడు కూడను నేనునేను అనే తత్త్వమును ప్రప్రథమములో గుర్తించటము అత్యవసరము. కాని అట్టి ఆధారమైన దానిని మనము విసర్జించి, ఆధేయమైన ప్రకృతిని మాత్రమే మనము ఆవరించి, ఆశ్రయించి తద్వారా మనము నిరాశకు గురి అగుచున్నాము.

చైతన్యము సర్వత్రా వ్యాపించినదే. కాని మనస్సునందు కూడను యీ చైతన్యము వున్నది. కాని మనస్సు యొక్క చైతన్యము పరిమితిలో కూడివుంటుంది. కనుక యీ మనస్సు యొక్క తత్త్వము ఒక్క మానవుని యందు మాత్రమే వికసించి, ప్రకటించి, ప్రభవిస్తూ వుంటుండాది. ఈ మనస్సు యొక్క పరిభావము చేతను, పరిణామము చేతను, ప్రభావము చేతను భౌతికమైన జగత్తును విచారించటము, పరిశీలించటము, పరిశోధించటము జరుగుతూ వుంటుండాది. ఈ నాటి విద్యయందు యీ ప్రకృతి యొక్క చైతన్యము గాని, ప్రకృతియొక్క పరిణామముగాని అంతర్భావముల యొక్క ప్రతిబింబమే. ఇదంతా కేవలము ఒకవిధమైన కళాచిత్రమే. (art) Art is outside heart is inside. Art should come from the heart. ఆ సత్యమును మనము గుర్తించాలి. మనము యీనాడు చూచే ప్రతిప్రతిబింబము కూడను మన చేతిలోని పిట్టను వదలి పొదలోని పిట్టకోసమై ప్రాకులాడునట్టుగా వుంటుండాది. ఈ నాటి మన పరిశోధనలు అన్నికూడను కేవలము అంతర్భావముల యొక్క ప్రతిబింబములనే సత్యాన్ని గుర్తించాలి. మనము చక్కగా మనస్సు యీ concentration చేస్తూ పోతే యీ దివ్యమైన మూలాధారము గుర్తించటానికి వీలవుతుంది. కనుకనే The essence of education is concentration of mind not collection of facts. కాని యీ నాడు collection లోపలనే మన జీవితమంతయు కూడను connection అయివుంటుండాది. కాని మన concentration అనేది కనుమరుగైపోయి వుంటుండాది. దీనిని మనము ప్రప్రథమములో గుర్తించాలి.

జగత్తంతయు కూడను మనకు అనేక విధములైన ప్రబోధలు

503078604

మనకు సలుపుతూ వస్తున్నాది. సహజంగా. ఎవరికి వారే తన జీవితము యొక్క రహస్యమును, చైతన్యమును గుర్తించుటకు ప్రయత్నించాలి. మన నిజస్వరూపాన్ని మనము విస్మరించి, మన ప్రతిబింబమును మనము అనుసరించి అజ్ఞానము చేత మరింత అంధకారములోనే ప్రయాణము సలుపుతున్నాము. మొట్టమొదట నీకు నీవు గురువు కావాలి. జగత్తును నీవు ఆచరణారూపమైన ప్రతిబింబముగా నీవు అనుసరించాలి. కనుకనే Nature is a preacher. Life is a teacher అన్నారు. మనము ఈవిధమైన సత్యాన్ని గుర్తించినప్పుడే మన జీవితము సక్రమమైన మార్గములో సరైన కాలములో మనము గమ్యమును చేరుకోగలము. ప్రతి వ్యక్తి కూడను తన యొక్క దివ్యత్వాన్ని తాను అభివృద్ధిగావించుకొనుటకు వెలిగించుకొనుటకు పూనుకోవాలి. ఏదో మనము కొన్ని గ్రంథములను మాత్రమే ఆశ్రయించి, కష్టపడి కంఠస్తము చేసి, పుత్తమస్థాయి లోపల వుత్తీర్ణుడు కావచ్చును. ఇంతమాత్రము చేతనే చదువుపూర్తి అయినదని భావించరాదు. గ్రంథ పరిచయము చేతను, కంఠస్తము చేతను యేర్పడిన విద్యలు విద్యలు కానేరవు. కనుకనే మనము Nature is a Preacher. ఏవిధముగా Nature Preacher గా వుంటుండాది. అదే మనకు సహనముతో, సత్యముతో, ఆవేదనా రహితముతో, స్వార్థరహితమైన భావముతో తాను అన్నింటిని సహించి, భరించి, లోకానికి తన యొక్క శాంత స్వభావాన్ని, సహజ స్వరూపాన్ని, సత్యభావాన్ని ప్రకటిస్తూ వస్తున్నది. ఒక వృక్షము వుందిఅనుకోండి. ఈ వృక్షము ఎండకు వానకు భరించి సహిస్తుంది. ఎవరైనా దానిని బాధించినా, హింసించినా కూడను సహిస్తుంది. తనను హింసించిన వ్యక్తులే తన ఆశ్రయమును కోరినప్పుడు, తన ఛాయను ఆశించినప్పుడు వారికి చల్లదనమును అందిస్తుంది. వారిని ద్వేషించదు. ప్రతిఫలమును వారికందించదు. సహనము చేత తీయని ఫలములను వారికి అందిస్తుంది. ఈ వృక్షము యొక్క సహజమైన శాంత స్వభావమును మానవుడు మొట్టమొదట గుర్తించి తాను కూడను దాని ద్వారా కొన్ని లక్షణములను గుర్తించాలి. ఇంక పక్షులు చూడండి. ఈ పక్షులు నిరంతరము ఆనంద ఆహ్లాదములో తన యొక్క ఆటలను ఆడుకుంటూ వుంటాయి. ఏదో ఏనాడో రాబోయే జీవిత నిమిత్తమై తాను యేవిధమైన ధనమును ఆర్జించి కూడబెట్టుకొనుటలేదు. జీవితము క్షణభంగురమనే సత్యమును పక్షులు కూడను గుర్తిస్తాయి. కనుక ఎప్పటి జీవితాన్ని, ఎప్పటి ఆకలిని అప్పటికి తాను మాత్రము అనుభవించి మున్ముందు యేమిగతి యని అనే విచారణ యేమాత్రము చేయవు. ఒరే నా బిడ్డలు యేవిధముగా అభివృద్ధి కావాలని బ్యాంక్ బ్యాలన్సు కోసమనో యింకేవిధమైన అభివృద్ధి కోసమనో, ఏ యింట్లో మేడలో కట్టి వాటి ఆధార నిమిత్తమై అవి యేమాత్రము ప్రాకులాడవు. అవి తమ తమ ఆత్మవిశ్వాసముపై తాము ఆధారపడి వుంటున్నాయి. ఒక చిన్న ఉదాహరణము. ఒక లేత కొమ్మపైన చిన్న పక్షి వాలుతుంది. కాని అది కూర్చున్న తక్షణమే కొమ్మ వూగుతుంది. ఈ కొమ్మ వూగినదే అనే భయము ఆపక్షికి యేమాత్రములేదు. కారణము.

ఆకొమ్మను తాను ఆశ్రయించలేదు. తనరెక్కలను తాను ఆశ్రయించింది. కనుకనే కొమ్మ వూగనీ రాలనీ, కూలనీ తనకే మాత్రము భయము వుండదు. తన ఆత్మవిశ్వాసము, స్వశక్తిపైన తాను ఆధారపడటంచేత. కాని యీనాటి మానవుడు సంసారమనే చిన్న వృక్షము మీద కూర్చున్నప్పటికి అది యిటూ అటూ యేకించిత్తు అశాంతి సంభవించినప్పటికి వాడు కృంగి కుమిలి కృశించి పోతున్నాడు. పక్షికున్న ఆత్మవిశ్వాసము యీనాటి మానవునకు లేక పోతున్నది. కనుకనే పక్షియొక్క ఆదర్శమును, పక్షియొక్క అనుభూతిని మానవుడు చక్కగా గుర్తించి తాను కూడ ఆవిధమైన తెలివితేటలను కలిగి వుంటుండాలి. ఇదే విధముగనే ప్రతిపదార్థము యొక్క విచారణ కూడను మనము చక్కగా చేసినప్పుడు యిందులో వుండిన అంతరార్థము అనుభూతిలో అందించేద. కనుక Nature is Preacher అన్నారు.

మానవుని యందు యీప్రాకృత సంబంధమైన భావములు యనేక విధములుగా చేరిపోటంచేత తరతరములనుండి కూడను వాని మనసులో కరడుకట్టుకొని పోయిన అజ్ఞానమే దీని మూల కారణము. ఈ మానసిక సంకల్పములోనున్న అజ్ఞానమును తొలగించవలెనన్న మంత్రాలతో తంత్రాలతో, యజ్ఞాలతో యాగాలతో, జపధ్యాన భజనలతో యే మాత్రము కూడను యివి తొలగిపోవు. నిజముగా అంతరాత్మయొక్క తత్వము నేను అనే తలంపు యొక్కతత్వమును యేనాడు మానవుడు గుర్తించునో ఆనాడు యివి యేమాత్రము కూడను మనిషిని బాధించవు, బోధించవు. ఒక పాత్రలో వుండిన తైలము లోపల చంద్రప్రతిబింబము కనిపిస్తుండాది. ఈ చంద్రప్రతిబింబమును యీతైలమునుండి తొలగించవలెనని యీపాత్రను కొండబోయి అగ్నిలోపెట్టి చక్కగా కాల్చినప్పటికిని ఆప్రతిబింబము తొలగదు. ఈప్రతిబింబమునకు ఆధారము యేమిటి? తైలము. తైలము తొలగినప్పుడే ప్రతిబింబము కూడను తొలగుతుంది. అంతేకాని పాత్రను కాల్చినంత మాత్రమున ప్రతిబింబము దూరము కానేరదు. మన దేహమే ఒక పాత్ర. ఇందులో వుండిన విషయ వాసనలు. మోహమనేదే యిందులో తైలము. బాగా జిడ్డు. ఇందులోనే మనస్సు యొక్క ప్రతిబింబము ప్రకాంతిలో కనిపిస్తుండాది. దీనినే చంద్రమా మనసో జాతః అన్నారు. అనగా చంద్రుని యొక్క ప్రతిబింబము మనస్సు. మనసు యొక్క ప్రతిబింబము చంద్రుడు. ఈ మనోసంకల్పములు దూరము చేయవలెనన్న కేవలము దేహాన్ని శ్రమింపజేసి దీనితో జపధ్యాన యోగాదులంతా జేసి, ఎన్నివిధములైన పరిశ్రమలు సలిపినప్పటికిని యిందులో వుండిన మనస్సు యొక్క మాలిన్యము తొలగదు.

పుట్టపైన మర్దించిన పాము మరణమొందునా?
తనువును తాదండించిన విషయ భోగములడగునా?
ఆకలిదప్పులు మానినంత ఆత్మజ్ఞాని తానగునా?

తానెవరో తెలియకున్న తత్త్వజ్ఞానమెటుకుదురును?

కనుక మొట్టమొదటి నేనెవరు అనే సత్యాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. దానిని గుర్తించినప్పుడే జగత్తునంత కూడను సులభముగా గుర్తించగలడు. భగవంతునకు ప్రకృతి ఒక భిన్నముగా వున్నదని భావించే వ్యక్తి మాత్రమే యీప్రకృతి మిథ్యము. భగవంతుడే ప్రకృతి అనే సత్యాన్ని గుర్తించిన వానికి ప్రకృతి కూడను సత్యమే. కనుక మనము దృష్టిలో పాన్ని పోగొట్టుకోవాలి. సృష్టిలో దోషాన్ని మనము వెతకరాదు. సృష్టి అంతయు కూడను భగవత్ మయమే. ఇట్టి సత్యాన్ని మనము యీనాడు మన విద్యద్వారా గుర్తించటానికి ప్రయత్నించాలి. నిజముగా విద్య అంటే ఆత్మవిద్యయే. నిజమైన విద్య. ఈ భౌతిక విద్యలు యీప్రాకృతమైన జీవితానికి అవసరమే. అయితే యివి మిథ్యమైనవి, అపరిపూర్ణమైనవి. ఈ అపరిపూర్ణమైన విద్యద్వారా పరిపూర్ణమైన విద్యాస్వరూపుణ్ణే మనము గుర్తించటానికి ప్రయత్నించాలి.

ఈనాటి మానవుని యొక్క దృష్టి అంతయు కేవలము బాహ్యజగత్తుపైనే ప్రసరిస్తూ వుంటుండాది. ప్రకృతిని పరిశీలించే శక్తి సామర్థ్యములు యీవిద్యయందు వున్నవిగాని పరమాత్మని పరిశీలించే శక్తిసామర్థ్యములు యీవిద్యల్లో యేమాత్రము కూడను లేవు. ఎంతకాలమైనప్పటికిని యీప్రకృతినే మనము పరిశోధిస్తూ పరిశోధిస్తూ పోయినప్పటికినీ మనకు తేలేది పంచభూతములే. ఈపంచభూతములను ప్రధానంగా, ప్రమాణంగా, ఆధారంగా తీసుకొని మనము యీ ప్రకృతిని అనుభవించటానికి ప్రయత్నిస్తున్నాము. అయితే యీప్రకృతి యొక్క తత్వము మనము యెంతవరకు అనుభవించటానికి వీలవుతుంది. ఇది కూడను ఒక పరిమితముతో కూడినది. ఏనాటికైనా కూడను, యివన్నియూ ఒక అపరిమితముతో కూడినవి కావు. పరిమితముతో వుండినవి- కనుకనే బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి. బ్రహ్మతత్వాన్ని గుర్తించినవాడే బ్రహ్మ కాగలడని వేదాంతము. చరిత్రలు చదివేవాడు కేవలము చరిత్రమును గుర్తించటము కాదు వాడు చారిత్రకుడు కావాలి. రామాయణమును శ్రవణము చేసి విని యితరులకు వినిపించినంత మాత్రమున చాలదు. తాను రామునిగా మారిపోవాలి. ఇట్టి మూలాధారమైన సూత్రాన్ని మనము గుర్తించినప్పుడే మన యొక్క చదువు కూడను సార్థకము కాగలదు.

విద్యయొసగు వినయము. వినయమున కలుగు పాత్రత. అని దీని యొక్క అంతరార్థము. పూర్వము అంతయు కూడను ఒకరిని ఒకరు మిత్రులు కలుసుకున్నప్పుడు వారు యెంతో అప్యాయముగా ఒకరినొకరు ప్రశ్నించుకుంటూ వుండేవారు. ప్రాచీన సాంప్రదాయమును అనుసరించి ఆధునిక ఆంగ్ల భాషలో కూడను ఒకరినొకరు కలుసుకున్నప్పుడు GOD BOY అని ఒకరికొకరు వుచ్ఛరించుకొంటూ వుండే వారు. ఇది ఆనాటి ప్రాచీన సంస్కృతి యొక్క ప్రధానమైన ఆధారము. క్రమక్రమేణా యీ ఆధునిక విద్యలు

503078607

పెరుగుతూ పెరుగుతూ GOD BOY పోయింది; GOOD BOY. పోని కొంత వరకు మంచిగానే GOOD BOY అన్నారు. క్రమక్రమేణా యీ ఆధునిక విద్య మరింత పెరిగి పోవటం చేత GOOD BYE అన్నారు. ఇంకా పెరుగుతూ పెరుగుతూ పోయేటప్పటికి GOOD పోయింది. BYE-BYE అన్నారు. ఈ విద్య యొక్క తేలిక, యీ విద్య యొక్క అసహ్యము యెంత వరకు దిగజారిపోయిందో మీరే యోచన చేసుకోండి. ఒకరి కొకరు చూచినప్పుడు హరిఓం లేక ఓం లేక సాయిరాం ఒకరికొకరు భగవత్ వాక్యము చేత వారినందరు నమస్కరించటము ప్రాచీన సంస్కారము. నమస్తే లేక నమస్కారము అని చెప్పేవారు. ఈనాడు ఒకరికొకరు మిత్రులు ఆధునిక విద్యలు అభ్యసించటము చేత ఒకరు యింకొకరిని చూచినంత సిగరెట్టు చూపి హలో take it సిగరెట్టుతో వారు నమస్కారము చేస్తున్నారు. లేక ఒక బ్రాందీ బాటిల్ అందించటమో జరిగి పోతుండాది. ఇంకా ఆధునికముగా జరుగుతూ జరుగుతూ ఒక card pack చూపిస్తుంటారు. come on come on. cards ఆడటం. ఈ విద్యల యొక్క విలువ యీ విధముగా దినదినానికి కూడను దిగజారిపోతుండాది. కనుకనే యీ విద్యల వల్ల ప్రయోగమనేది మనకు కనిపించటమే లేదు. ఈ విద్యలు కేవలము పూర్తి పొట్టకూటిని కూడను అనుభవించటానికి అవకాశము లేకుండా చేస్తున్నాయి. పేపర్లో చూద్దామా అంటే చదువుకున్న విద్యార్థుల కందరికి కూడను యీ ఎంప్లాయిమెంటు లోపల అన్ని విధాల కూడను ఎడ్వర్ టైజు చేస్తుంటారు. apply, apply, apply కాని no reply. యీ applyలు చేసి చేసి చేసి వున్న డబ్బు కూడా applyలకే పోతుండాది. కానీ యే apply చేయకుండా Reply యిచ్చేటందును కూడా అందించేదే యీ దివ్య ఆత్మ తత్వము. కనుక మొట్టమొదట విద్యార్థులు యీ భౌతిక విద్యలతో బాటు ఆధ్యాత్మిక విద్యను ప్రధానమైన ఆధారముగా మీరు విశ్వసించాలి. ఈ నాటి విద్యల లోపల మనము యనేక విధములుగా 1st rank 1st class రావాలని చెప్పని మనము చాలా ప్రయత్నము చేస్తున్నాము. అది అవసరమే. అది కాదనటము లేదు. కానీ యే విధముగా నీవు 1st class తెస్తున్నావు. 1st class, 1st rank వస్తుండాది. నిత్యజీవితములో నీ నిత్యానుభూతి, నీ నిత్య ప్రవర్తన కూడను అత్యవసరముగా దాంట్లో 1st rank రావాలి. ఈ నాటి ర్యాంకులంతా కూడను స్వాభావికమైన, ప్రాకృతమైన మార్గమును అనుసరిస్తూ వున్నాము. అనగా యిది కేవలము ఒక విధమైన మెకానికల్ గా జరిగిపోతుండాది. ఈ మెకానికల్లో కొంతవరకు మీరు గుర్తించాలి. ఇవి సహజములు కావు. ఇవి అసహజాలు. కొన్ని వారి యొక్క అభ్యాసములు. ఇలాంటివి మానవులకు, విద్యార్థులకు సరియైనవి కాదు. విద్యార్థులు రాత్రి పది గంటల తరువాత చదవటానికి పూనుకోకూడదు. కారణమేమనగా పగలంతయూ కూడను శ్రమించి పని చేసిన యీ దేహానికి రాత్రి విశ్రాంతి అవసరము. కేవలము కష్టపడి ర్యాంకు తెచ్చుకోవాలని శ్రమపడి, రాత్రి నిద్రను కూడను భంగము గావించుకొని యీ యొక్క subconscious

503078608

లోపల చదవటము ప్రారంభిస్తూ వుంటారు. తద్వారా చదవటంకూడను జరుగక పోవచ్చు అనారోగ్యములు యేర్పడవచ్చు. క్రమక్రమేణా కృత్రిమమైన దీపములతో చదవటంచేత కన్నులయందున్న రెటీనా దెబ్బతిన వచ్చు. ఈ కృత్రిమమైన ఎలక్ట్రిక్ వెలుగు వల్ల రెటీనా చాలా దెబ్బతింటుంటది. సహజమైన వెలుతురులో మనము చదవటానికి ప్రయత్నించాలి. కొంతమంది రాత్రిపూట చదవటము అభ్యాసము చేసుకుంటారు. దానివలననే జ్ఞాపకశక్తి పెరుగుతుందని భావిస్తుంటారు. ఇది కేవలము అభ్యాసము తో యేర్పడిన imagination భ్రాంతులు. ఈ విధమైన ప్రయత్నములతో తమ యొక్క భవిష్యత్తులో ఆరోగ్యాన్ని కోల్పోతారు. ఇంకా కొంతమంది ఏదో ఒకటి పొగపీలుస్తేనే గాని తెల్లవారి బయటకుపోటానికి వీలు కాదు అంటుంటారు. ఇవి కూడను ఒకవిధమైన దురభ్యాసముల లోపల భావములే గాని యివి కూడను సహజమైనవి కానేరవు. కొంతమంది మాటలతో, ఆటలతో, చేష్టలతో, నడకలతో యనేక విధములుగా కూడను కొన్ని విధములైన యీ అభ్యాసములచే సహజాన్ని కోల్పోతున్నారు. ఇది కేవలము మెకానికల్ గా జరిగిపోతూ వుంటుండాది. ఇది సరైనది కాదు. ఈ మాటల లోపల కూడను, ఉపన్యాసముల లోపల కూడను చాలామంది but, but, you see, you see so, so, so యిలాంటివన్ని కూడను వుపయోగ పెట్టుతుంటారు. ఇవన్నీ కూడను ఒక విధమైన అభ్యాసముతో యేర్పడిన దురభ్యాసములే. you see, you see ఏమిటి you see ఎక్కడుంది. దీనియొక్క అర్థమేమిటి? కొంతమందికి కొన్నివిధములైన అభ్యాసములు వుంటుంటాయి. మాట్లాడే సమయములో (బుజాలు ఎగరవేయటం) యీ విధముగా చేయటం. ఇది కూడను ఒక విధమైన దురభ్యాసములో ప్రధానమైనది. విద్యార్థులలో యీ విధమైన వికారములు బయలుదేర కూడదు. చాలామంది విద్యార్థులు నేను చూస్తున్నాను మాట్లాడుతూ మాట్లాడుతూ కాళ్లు వూపుతుంటారు. ఇది చాలా తప్పు. కొంతమంది వూరికే కాళ్లు ఆడించటము యీ విధముగా కూడను కొన్ని విధములైన దురభ్యాసములలో చేరినవి. ఇవి మెకానికల్ గా జరిగేవేగాని సహజముగా వచ్చేవి కావు. కనుక యీనాటి విద్యకూడను మెకానికల్ గా జరిగిపోతూ వుంటుంది. విద్య మెకానికల్ గా వుంటుంటే వుపయోగము యే మాత్రము వుండదు ప్రపంచమునకు. హృదయము నుండి రావాలి. అనుభూతిలో అందించాలి. ఆచరణలో పెట్టాలి. ఈ ఆచరణలో వుండిన విద్యయే నిజమైన విద్య.

కనుక ఆత్మతత్వాన్ని నేను అనే భావములో వుండిన సంబంధాన్ని మొట్టమొదట విద్యార్థులు గుర్తించటానికి ప్రయత్నించాలి. ఈ నేను అనేది వుండినంత వరకు కూడను ప్రపంచము దుఃఖము. మనము యే మాత్రము కూడను దూరము చేసుకోటానికి వీలుకాదు. ఒక చిన్న ఉదాహరణము. నిద్రలోపల మనకు నేను అనే తలంపు

503078609

లేదు. ఈ నేను అనే తలంపు యెప్పుడు లేదో అప్పుడు ప్రపంచము కూడను మనకు కానరాదు. ప్రపంచము ఎప్పుడు లేదో దుఃఖము కూడను అప్పుడు లేదు. తిరిగి నిద్రనుంచి మనము లేచితిమా యీ నేను అనే తలంపు ప్రారంభమైంది. ఈ నేను అనే తలంపు ప్రారంభమాయనా ప్రకృతి అంతయు కూడను మనకు గోచరమవుతున్నాది. ఇది ఎప్పుడు మనకు దర్శనమిచ్చునో అప్పుడు దుఃఖము ప్రారంభమవుతున్నాది. కనుకనే యీ దుఃఖమును దూరము చేసుకొని ఆనందాన్ని సమీపించి ఆత్మతత్వాన్ని అనుభవించే విద్యనే నిజమైన విద్య. అదే Self Realisation. ఈ self realisation కు మొట్టమొదట ఆత్మ విశ్వాసాన్ని అభివృద్ధి పరచుకోవాలి. అదే Self confidence. అదే నీకు ఆనందాన్ని యిస్తుండాది. Self confidence ఎప్పుడు అభివృద్ధి పరుచుకున్నామో Self satisfaction తృప్తి యిస్తుండాది. యీ confidence వుండినంత వరకు కూడను నీకు ఏమాత్రము అసంతృప్తి వుండదు. నీలో ఏదో ఒక అసంతృప్తి వుంటున్నాదంటే నీలో confidence చక్కగా లేదన్నమాటే దాని యొక్క అంతరార్థము. కనుకనే మొట్టమొదట మన హృదయము లోపల సరైన confidence develop చేస్తే nation అంతా కూడను సరైన ప్రకాశముతో జీవిస్తుంది. Light a lamp in each house whole street will be lighted. నీయొక్క హృదయము లోపల నీయొక్క విశ్వాసమనే లైటును నీవు అంటించుకుంటివా యీ జగత్తంతా కూడను ప్రకాశంగా నే కనుపిస్తుంది. కనుక మీలో వుండిన యీ దివ్యమైన జ్యోతిని మీరు మొట్టమొదట వెలిగించుకొనుటకు ప్రయత్నించండి. ఇలాంటి సత్యమైన, నిత్యమైన, ఆదర్శమైన, ఆధారమైన విషయాన్ని విస్మరించి యేవో మార్కులు, ఆ మార్కులు రావటం కోసమని యీ చదువులు చదివితే దానివల్ల జరిగేది యేమీ లేదు. ఎంతమంది విద్యావంతులు లేరు. ఎంతమంది గొప్ప గొప్ప scholars లేరు యీ జగత్తులో. అందరూ కూడను ఆనందాన్ని కోల్పోయి, అశాంతి లో మునిగి, నిస్పృహలో నిరాశతో జీవితాన్ని వదలి పెడుతున్నారు. హిట్లర్. హిట్లర్ జగత్తునంతా అదరించాడు. ఇంత గొప్ప మేధావి అనుకున్నాడు. కాని అతని యొక్క అహంకారమే అతని ప్రాణాన్ని తీసింది. యుద్ధావంతర్ధ్వని. తాను చేసిన తప్పులన్నిటిని తాను అనుభవించక తప్పలేదు. న్యూటన్ యీ భూమి యొక్క ఆకర్షణ శక్తిని కని పెట్టాడు. ఎంతయో శక్తిమంతుడు. మేధావి. తెలివితేటలు గలవాడు. కాని అతని జీవితములో ఆనందమనేది అనుభవించలేదు. న్యూటన్ యనేక విధములుగా పరిశోధనలు చేసి కట్టకడపటికి పిచ్చితోనే మరణించాడు. మతిభ్రమగా జరిగింది. కనుక యీ అనిత్యమైన వాటి లోపల మన సత్యాన్ని నిత్యాన్ని వెతికే దానిలో తెలివితేటలను

503078610

వుపయోగపెట్టి మనసహజ జీవితాన్ని మనము కోల్పోరాదు.

మనకు యీ జగత్తు లోపల యేదో ఒక విధమైన tensions మనలోనుంచి ఆవిర్భై వస్తుంటాది. అది మంచిదైన నవ్వుతాము. చెడ్డదైన ఏడుస్తాము. ఈ ఏడ్పులుము, నవ్వులుము. దేనికోసము. నువ్వు ఏడ్పులని కాదు. నవ్వాలని కాదు. ఆ tensions యేదో ఒక విధంగా అది బయటపడిపోవాలి. అది ఖర్చైపోవాలి. ఆ ఖర్చయ్యేనిమిత్తమై కొన్నిదాన్లకు ఏడుస్తాము కొన్నిదాన్లకు నవ్వుతున్నాము. ఇదంతా tensions యొక్క Reactionలే. ఒక చిన్న ఉదాహరణము. పోయిన వారము కస్తూరి మిమ్మల్ని నవ్వించి వుండవచ్చు. ఆయన హాస్యములో ప్రధానకర్త. అయితే అన్నింటి యందు కూడను హాస్యము సరికాదు. ఆధ్యాత్మిక మార్గమునందు, పవిత్రమైన విషయములందు చాలా seriousగా మాట్లాడాలి. ఈమధ్యలో హాస్యమే గాని వచ్చిందంటే ఆ పవిత్రత అంతా కూడను పాడైపోతుంది. కనుక సమయ సందర్భానుసారముగా చూచుకొని యీ హాస్యము, యీ పవిత్రతను వుపయోగపెడుతూరావాలి. ఒకడు దారిన నడుస్తూ వుంటాడనుకోండి ఆ దారిన నడిచే సమయములో యేదో ఒక అరటి తొక్క పడుంటే జారి క్రింద పడిపోవచ్చు. ఆ జారిపడినప్పుడు దెబ్బనే తగలకుండిన తాను నవ్వుతాడు చుట్టూవున్నవాళ్లు నవ్వుతారు. కాని అక్కడ దెబ్బగాని తగిలెనా తాను ఏడుస్తాడు, చుట్టూవున్నవాళ్లు కూడను చాలా seriousగా వచ్చి అతనికి help చేస్తారు. అనగా ఆసమయము సందర్భానుసారముగా జరిగిన tension యొక్క Reaction.

కనుక ప్రతి మానవుని యందు కూడను యేదో కొన్ని నిరాశలో ఆశలో వస్తుంటాయి. వాటి యొక్క Reactionలు యీ యొక్క విచారంగా రూపొందుతాయి. ఇవి సంకల్ప వికల్పముల యొక్క పరిణామములే. పోయిన సంక్రాంతి దినము నేను చెప్పాను. యీ సంకల్పములను గురించి, మనస్సును గురించి మొట్టమొదట ప్రతి వ్యక్తి కూడను గుర్తించుటకు ప్రయత్నించాలి. అప్పుడే యీ మానవత్వమనేది చక్కగా అర్థమవుతుందని చెప్పి ప్రతి గురువారము యీ మనస్సును గురించి తప్పక నేను ప్రబోధిస్తానని చెప్పాను. కాని ఆ అవకాశము యీనాటికి ప్రారంభము అయింది. ఇంక మున్ముందు ప్రతి గురువారము కూడను యీ సంకల్పముల, యీ మనస్సు యొక్క ప్రభావాన్ని గురించి తెలుసుకోటం అత్యవసరము. ఈ మనసు యొక్క ప్రభావములు మనసు యొక్క Reactions కూడను ఐదు కోట్లు వుంటున్నాయి. ఒకటి కాదు రెండు కాదు. ఐదు కోట్ల స్వరూపాన్ని ధరిస్తుంది యీ మనస్సు. కనుక నేను అనే సంకల్పము మనము ప్రారంభించుకుందాము. ఇవి ఐదు కోట్ల అలలు అని కూడను చెప్పవచ్చును. కనుక మనము యీ విద్యావిధానములోపల ప్రాకృతమైన దానిని, ప్రాకృతమైన భావముతో మనము అనుసరిస్తూ దీనికి ఆధారమై

503078611

నదివ్యాత్మాన్ని దివ్య భావముతో విచారణ సలుపుతూ రెండింటి యందు కూడను ఉత్తీర్ణులు కావటానికి, దానికి ఉత్తేజము అభివృద్ధి పరచుకోటానికి విద్యార్థులు ఉత్సాహముతో తగిన కృషి చెయ్యాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. మనిషి తనకు తాను యెంత దూరమో భగవంతునికి కూడను అంత దూరముగా వుంటాడు. అనగా తాను అంటే యీ దేహము కాదు. నేను అనే భావము యే స్థాయి యందుంచుకున్నాడో ఆ స్థాయికి తగినట్టుగానే భగవంతుడుంటాడు. ఈ నేను అనేది చెప్పేది ఎవరు? దేహమా? కాదు కాదు. దేహము జడము. కనుక యీ జడమైన దేహము నేను అని పలకటానికి వీలులేదు. ఇంక ఆత్మ నేనని చెప్తుందా అంటే ఆత్మ యేకత్వాన్ని ధరించినది కనుక రెండవ పదార్థమనేదే లేదు. కనుక ఆత్మ కూడా చెప్పటంలేదు. కనుక నేను అనేది యీ దేహానికి, ఆత్మకు మధ్యలో చేరి రెండింటిని చేర్చి అంతర్ధానమై పోతుందాడి. చేర్చి మరి తాను కనిపించటంలేదు. ఇదియే 5కోట్ల విచారణ తరువాత జరిగిన ఫలితము. కనుక యిట్టి చేరికను ప్రతి మానవుడు కూడను నాస్తికుడు యాస్తికుడు, ఆస్తికుడు, ఆస్తిక నాస్తికుడు సర్వులు కూడను తెలుకోవలసిన విషయము. కనుక తన యొక్క వునికిని తాను లేదని చెప్పేవాడు ఒక్కడు కూడను లేడు. జగత్తులో. తన తత్వమును తాను గుర్తించటమే. నిజమైన ఆధ్యాత్మికమని మనము గుర్తించాలి.